క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ రాజశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సైబర్‌వ్యాలీ, సైబర్ విలేజ్, సంకల్ప్ అపార్ట్‌మెంట్, వసంత విల్లాస్ పరిసరాలలో, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు న్యాక్ ఎంట్రెన్స్ రోడ్, అపర్ణ అపార్ట్‌మెంట్స్, ఇజ్జత్‌నగర్ విలేజ్, జూబ్లీ గార్డెన్, అలేఖ్య అపార్ట్‌మెంట్స్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 150-160, పచ్చిమిర్చి 70-80, బెండ 60, కాకర 60, దొండ 40, దోస 40, ఆలు 25, చామ 50, కీర 25, బీర 60, వంకాయ 50, గోకర 50, బీన్స్ 120, బీట్‌రూట్ 45, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 30, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 100 (4 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30-40, అల్లం 300, వెల్లుల్లి 220.

అందుబాటులో దూరవిద్య కోర్సుల రీ అడ్మిషన్ పోర్టల్

రాయదుర్గం: మనూలో దూరవిద్య కోర్సులు చదివే విద్యార్థుల కోసం రీ అడ్మిషన్లకు ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(డీడీఈ) ఆదేశం ప్రకారం ఆలస్య రుసుంతో రీ అడ్మిషన్ ఫారమ్ సమర్పణకు పోర్టల్‌ను తెరిచారు. పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు, అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులకు 2005 నుంచి వార్షిక మోడ్‌లో రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది. పోర్టల్ ఆగష్టు 10వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది.

కరోనా పరీక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం 11 మందికి కొవిడ్ ర్యాపిడ్ ఆంటీజన్ టెస్టులు నిర్వహించగా అందులో అందరికీ నెగిటివ్ వచ్చిందని నిర్వాహకులు మనోహర్ తెలిపారు. అదేవిధంగా 10 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి



తహశీల్దార్ శ్రీనివాసరావును కలిసిన కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జా అవుతున్నాయని కాపాడాలని తహశీల్దార్ టి.శ్రీనివాసరావును బీజేపీ రాష్ట్ర నాయకులు, జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు బస్‌పాస్‌లు పంపిణీ



హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని సరస్వతి విద్యా మందిర్ పాఠశాలలోబండి రమేష్ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు బస్‌పాస్‌లను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి రమేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. బాగా చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ప్రధానోపాధ్యాయులు అరుణ, అసిస్టెంట్ హెడ్మాస్టర్ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు సంగారెడ్డి, నర్సింగ్‌రావు, రవీంద్రరావు, అరుణ, సత్యారెడ్డి, అంజద్, సిల్వర్ మనీష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లు ప్రారంభం

కూకట్‌పల్లి: ఆపద వస్తే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ 466 అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ నేపథ్యంలో బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గానికి చెందిన 108,102 వాహనాలను ఎన్‌కెఎన్ఆర్ గార్డెన్స్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ నిరుపేదలకు అండగా ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు నడిపే గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

అసలే అద్దె భవనం.. అదీ శిథిలావస్థలో..

- ఇదీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ తీరు
- వందకోట్ల ఆదాయం వచ్చినా పట్టించుకోని అధికారులు



స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు



హఫీజ్‌పేట్ : వంద కోట్ల రూపాయలు ఆదాయం వస్తున్నా...ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు సొంత భవనమే లేదు. చందానగర్ హుడా కాలనీలో చందానగర్ లా అండ్ ఆర్డర్ పోలీస్‌స్టేషన్ కోసం అద్దె భవనం తీసుకున్నారు. లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు సొంత భవనం నిర్మించాక, ఆ భవనాన్ని ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. అప్పటి నుంచి ఆ ఇరుకు భవనంలోనే ఎక్సైజ్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో అనేక సమస్యలు నెలకొన్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు సొంత భవనం కోసం విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వచ్చాయి. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ చివరగా 2023లో గోపన్‌పల్లిలోని సర్వే నంబరు 37లో 600 గజాల స్థలం కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కానీ శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్సైజ్ స్టేషన్‌కు సంబంధించిన సర్వే పత్రాలు అందించడంలో ఆలస్యం జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

- శేరిలింగంపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 39 వైన్స్, బార్లు 102 ఉన్నాయి.
- స్టేషన్‌లో ఒక ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక హెడ్‌కానిస్టేబుల్, ఉండగా, 9 మంది కానిస్టేబుళ్లకు ఇద్దరే ఉన్నారు. 7 ఖాళీలతో ఇబ్బందులు పడుతున్నారు.
- దశాబ్ద కాలం నుంచి అద్దె భవనం ఇరుకుగా ఉండడంతో సీజ్ చేసిన వాహనాలు పార్కింగ్ చేయడానికి స్థలం లేదు.
- ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్టేషన్‌లోని వస్తువులు, ఫైల్స్ తడిసిపోయాయి.



వర్షాలకు ఉరుస్తున్న స్లాబ్



గోడల నుంచి వర్షపు నీరు పడుతుంటే టేబుల్‌పై ట్రేలు పెట్టిన దృశ్యం

సర్వే రిపోర్టు రావాలి



శేరిలింగంపల్లి మండలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు గోపన్‌పల్లిలో 600 గజాల స్థలం కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. సర్వే రిపోర్టు ఇంకా ఇవ్వలేదు. అది రాగానే నూతన భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా..
– గాంధీనాయక్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పటాన్‌చెరు : మియాపూర్ నుంచి ఇస్నాపూర్ చౌరస్తా వరకు మెట్రో రైల్ విస్తరణతో పాటు, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలకు హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఇస్నాపూర్ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం టపాసులు కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు ఎంపీపీ సుష్మా మాట్లాడుతూ... అతిపెద్ద పారిశ్రామిక వాడ పటాన్‌చెరులో ఇస్నాపూర్ వరకు మెట్రో రైలు విస్తరణ మూలంగా లక్షలాది మంది ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, అఫ్జల్, రాజేష్, మెరాజ్ ఖాన్, ఆయా గ్రామాల సర్పంచులు ఉపేందర్, కృష్ణ యాదవ్, కుమార్, లక్ష్మణ్, గోపాల్, ఎంపీటీసీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు నమోదుపై అవగాహన కల్పించాలి

డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: ఓటు నమోదు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. బుధవారం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో ఏఎంసీలు, సూపర్‌వైజరీ ఆఫీసర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు, బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఓటరు జాబితాలో నమోదు కాని అర్హుల కోసం ఈ నెల 5 తేదీ నుంచి కాలనీ అసోసియేషన్ కార్యాలయాల్లో నమోదు చేసుకునే విధంగా వారిని చైతన్య పర్చాలన్నారు. కాలనీ కార్యాలయాల్లో ఏ తేదీన ఏర్పాటు చేస్తామో వారికి సమాచారం అందించి, నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో చందానగర్ డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల భద్రత కోసమే షీ షటిల్ బస్సులు


సైబరాబాద్ కమిషనరేట్ అదనపు సీపీ అవినాష్‌మహంతి



షీ షటిల్ బస్సును ప్రారంభిస్తున్న అదనపు సీపీ అవినాష్ మహంతి, ప్రతినిధులు

రాయదుర్గం: ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ ప్రాంతాలలో పనిచేసే మహిళా ఉద్యోగులకు భద్రతతో కూడిన ప్రయాణం కోసమే షీ షటిల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు సైబరాబాద్ అదనపు సీపీ అవినాష్‌మహంతి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో ఎస్‌సీఎస్‌సీ పర్యవేక్షణలో ఎవినియోన్ ఇండియా 25వ వార్షికోత్సవం సందర్భంగా సీఎస్ఆర్ చొరవతో ఏర్పాటు చేసిన షీ షటిల్ 18వ బస్సును బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఇతర పోలీసు అధికారులు, ఎస్‌సీఎస్‌సీ, అవినియోన్ ఇండియా సంస్థల ప్రతినిధులతో కలిసి బస్సులో ప్రయాణించారు. కాగా 18వ షీ షటిల్ బస్సు బాలానగర్ వై జంక్షన్ నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్ మీదుగా ఎవినియోన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు వచ్చేలా నడపాలని నిర్ణయించారు. ఈ మార్గంలో ప్రయాణించే ఐటీ మహిళా ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని సైబరాబాద్ పోలీసులు, ఎస్‌సీఎస్‌సీ, ఏవినియోన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధికారులు కోరుతున్నారు.

బయోడైవర్సిటీ ఫ్లైఓవర్ ప్రమాద ఘటనలో మరొకరు మృతి



గిరి గౌడ్(ఫైల్)

గచ్చిబౌలి: బయోడైవర్సిటీ ఫ్లైఓవర్‌పై చోటు చేసుకున్న ప్రమాదంలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. జూలై 23న రాత్రి 9.45 గంటల సమయంలో యమహా ఎంటీ15 బైక్‌పై అతి వేగంగా వెళుతూ గచ్చిబౌలిలోని బయోడైవర్సిటీ ఫ్లై ఓవర్ రెయిలింగ్‌ను ఢీ కొట్టారు. దీంతో కుకునూరుపల్లి గ్రామం, మునుగోల్ మండలం, మెదక్ జిల్లాకు చెందిన బండి మధు(26), తేరాల గ్రామం, మోట కొండూరు మండలం, యాదాద్రి జిల్లాకు చెందిన పంజాల మచ్చ గిరి గౌడ్(24) లెవల్-2 ఫ్లై ఓవర్‌పై పడ్డారు. దీంతో మధు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలతో గిరి నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో గిరి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు సీఐ మహేష్ తెలిపారు.

నేటి నుంచి ఎన్‌వీఎస్ కబడ్డీ మీట్

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయ రీజనల్ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో జేఎన్‌వీ రీజనల్ స్థాయి కబడ్డీ పోటీలకు శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జవహర్‌నవోదయ విద్యాలయ వేదిక కానుంది. గురువారం ప్రారంభమయ్యే ఈ పోటీలు శనివారం వరకు కొనసాగుతాయి. ఈ పోటీలలో తెలంగాణ రాష్ట్రం నుంచి మహబూబ్‌నగర్ క్లస్టర్‌నుంచి ఒక జట్టు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు, వెస్ట్‌గోదావరి నుంచి రెండు క్లస్టర్ల జట్లు, కర్నాటక రాష్ట్రం చిత్రదుర్గ, కల్బుర్గి, తుంకూరుల నుంచి మూడు క్లస్టర్ల జట్లు, కేరళ, తమిళనాడుల నుంచి ఒక్కో క్లస్టర్ జట్టు పాల్గొంటాయి. ఈ 34వ రీజనల్ స్థాయి కబడ్డీ పోటీలను ఎన్‌వీఎస్ హైదరాబాద్ రీజన్ డిప్యూటీ కమిషనర్ టి గోపాలకృష్ణ ప్రారంభిస్తారు. 5వ తేదీ పోటీల ముగింపు కార్యక్రమం నిర్వహించనున్నారు.

నీటి సమస్య రానివ్వం

- మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): మున్సిపల్ పరిధిలోని కాలనీల్లో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి తెలిపారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో బోరును బుధవారం రోజారాణి ప్రారంభించారు. కాలనీవాసులతో మాట్లాడారు. కాలనీలో రోడ్లు, వీధిలైట్లు వేయాలని కాలనీవాసులు రోజారాణికి విన్నవించారు. కాలనీల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమకు తెలపాలని రోజారాణి ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డితో పాటు స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌యంటీ శాతవాహననగర్ కాలనీలో రూ.55.10 లక్షల అంచనా వ్యయంతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావుతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు, వార్డు మెంబర్లు, ఏరియా కమిటి మెంబర్లు, ఉద్యమకారులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



యాజమాన్య హక్కు పత్రాలు అందజేత



పాపిరెడ్డినగర్‌లో ఇంటి యజమానులకు పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌లు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి నగర్ కాలనీలో నివసిస్తున్న పేదలకు జీఓ 58,59 ద్వారా యాజమాన్య హక్కులను కల్పిస్తూ 22 మంది లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్ గౌడ్, నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావులతో కలిసి హక్కుల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా నివాసం ఉంటున్న నిరుపేదలకు జీఓ నంబర్ 58 ప్రకారం రెగ్యులరైజ్ చేసి వారికి భవిష్యత్‌పై భరోసా కల్పించిన గొప్ప మహానుభావుడు కేసీఆర్ అని కొనియాడారు. జీఓ 59 ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మొత్తం చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకొని ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీని సైతం పొందవచ్చన్నారు. ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌యస్ పార్టీ వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, కాశీనాథ్ యాదవ్, గుడ్ల శ్రీనివాస్, ఆర్. భగవంత్‌రెడ్డి, నరసింహులు ముదిరాజ్, రామకృష్ణారెడ్డి, కనకారెడ్డి, వీరభాస్కర్, శ్రీనివాస్, ప్రేమ్‌కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ఆనందం



నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్న రవికుమార్ యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ, ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలల్లో ట్రస్ట్ సెక్రటరీ రవి కుమార్ యాదవ్ సమక్షంలో బుధవారం ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ చేయటం దేవుడు ఇచ్చిన వరంగా భావిస్తున్నామని ఉచిత కంటి ఆపరేషన్లు చేయటం తమ ట్రస్ట్ ప్రత్యేకత అని తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయడమే తన తండ్రి భిక్షపతి యాదవ్ చూపిన మార్గమని చెప్పారు. కార్యక్రమంలో నర్సింగ్‌యాదవ్, నరసింహాచారి, అరుణ్‌కుమార్, కుమార్ యాదవ్, కమలాకర్‌రెడ్డి, సీతారామరాజు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలకు మంచినీరు అందించడమే లక్ష్యం

'ఎస్కీ' డైరెక్టర్ డా.రామేశ్వరరావు



'ఎస్కీ'లో ఇంజనీర్ల శిక్షణా కార్యక్రమంలో డైరెక్టర్ డా.రామేశ్వరరావు,అధికారులు

రాయదుర్గం: గ్రామీణ ప్రాంతాలకు సురక్షితమైన తాగునీటిని అందించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు స్పష్టం చేశారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని చాణక్య సెమినార్ హాల్‌లో కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రజారోగ్య విభాగం ఇంజనీర్లకు ' జల్‌జీవన్ మిషన్ కింద గ్రామీణ నీటి సరఫరా పథకాల ప్రతిభావంతమైన అమలు' అంశంపై ఇంజనీర్లకు ప్రత్యేకంగా మూడు రోజులపాటు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాయని, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిపై ప్రత్యేక బాధ్యత ఉంటుందన్నారు. అందుకోసం వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్కీ ఈఆర్‌డీ హెడ్ రాజశేఖర్‌రెడ్డి, ఫ్యాకల్టీ నరేష్, అధికారులు పాల్గొన్నారు.

సింప్లిబిజ్- టీఏటీ క్యాపిటల్ ఎంఓయూ

రాయదుర్గం: ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ) పూర్వ విద్యార్థి స్థాపించిన హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ 'సింప్లిబిజ్‌తో ఆస్ట్రేలియా ఆధారిత కార్పొరేట్ అడ్వైజరీ, క్రాస్ బోర్డర్ చెల్లింపు సంస్థ టీఏటీ క్యాపిటల్ భాగస్వామ్య ఒప్పందం చేసుకుంది. బుధవారం జరిగిన వర్చువల్ ఈవెంట్‌లో ఐఎస్‌బీ పూర్వ విద్యార్థి, సింప్లీబిజ్ ఇండియా వ్యవస్థాపకుడు రఘుబాబు, టీఏటీ క్యాపిటల్ వ్యవస్థాపకుడు రామ్ గౌర్ల ఒప్పందంపై సంతకాలు చేశారు.ఈ ఒప్పందంతో సహకారం, నైపుణ్యం, వనరుల మార్పిడికి అవకాశం కలుగుతుందన్నారు.

ఎమ్మెల్యేను పరామర్శించిన ప్రముఖులు



ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నివాసంలో బీహెచ్ఈఎల్ ఈడీ వరదరాజన్

పటాన్‌చెరు: ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పెద్ద కుమారుడు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి అకాల మరణం పట్ల బుధవారం శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీహెచ్ఈఎల్ ఈడి వరదరాజన్, కిర్బీ పరిశ్రమ ఎండి రాజు, జనరల్ మేనేజర్ రాజమహేందర్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి దేవుజ, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

హెచ్‌సీయూకు ప్రతిష్టాత్మక ఐపీడీసీ గ్రాంట్



హెచ్‌సీయూ యునెస్కో చైర్ అభివృద్ధి చేసిన నిత్యానంద జనవాణిలో పాల్గొన్న పశ్చిమబెంగాల్ పురూలియా మహిళలు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కొనసాగుతున్న యునెస్కో చైర్ దేశీయ భాషలు, కమ్యూనిటీ రేడియోపై ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్ డెవలప్‌మెంట్ ఆఫ్ కమ్యూనికేషన్ (ఐపీడీసీ) గ్రాంట్ మంజూరు చేశారు. స్థానిక భాషలను ప్రోత్సహించడానికి, కమ్యూనిటీ రేడియోల సామర్థ్యాలను బలోపేతం చేయడానికి యునెస్కో పారిస్‌లోని ప్రతిష్టాత్మకమైన ఐపీడీసీ ద్వారా హెచ్‌సీయూలోని కమ్యూనికేషన్ విభాగంలోని కమ్యూనిటీ మీడియాపై యునెస్కో చైర్‌కు పోటీ గ్రాంట్ లభించింది. చైర్ తన పనికోసం ఐపీడీసీ గ్రాంట్‌ను పొందడం ఇది నాలుగోసారి. 2027 వరకు హెచ్‌సీయూలో యునెస్కో చైర్ పునరుద్ధరించారని హెచ్‌సీయూ యునెస్కో చైర్ హోల్డర్ ప్రొఫెసర్ వినోద్ పవరాల పేర్కొన్నారు. హెచ్‌సీయూలో యునెస్కో చైర్ 2011లో ప్రారంభించినప్పటి నుంచి తాము చేపట్టిన అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టులలో ఇది ఒకటి అని పేర్కొన్నారు.

న్యూ స్టూడెంట్స్@550

- రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అడ్మిషన్ల జోరు



మధురానగర్‌లోని రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

రాయదుర్గం: మధురానగర్‌లో రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ చివరి దశకు చేరింది. కొన్నేళ్లుగా కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

- ఇప్పటి వరకు కళాశాలలో కొత్తగా 550 మంది విద్యార్థులు చేరారు.
- ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 450 మంది విద్యార్థులు చేరారు.
- ఒకేషనల్ కోర్సులో అత్యధికంగా 104 మంది విద్యార్థులు చేరడం విశేషం.
- రెండవ సంవత్సరంలో ఇప్పటికే 380 మంది విద్యార్థులు చదువుతున్నారు.
- ఎలాంటి ఫీజులు లేకుండా అడ్మిషన్ సౌకర్యం కల్పిస్తుండగా, ఈనెల 16వ తేదీ వరకు కొత్తగా విద్యార్థులు చేరేందుకు గడువు ఉంది.

అడ్మిషన్లు పెరుగుతున్నాయి



రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏటేటా అడ్మిషన్ల సంఖ్య పెరుగుతోంది. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన, క్రమశిక్షణతో మెలిగేలా చేయడం, నాణ్యమైన విద్య అందించడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరుతున్నారు. సంఖ్య పెరిగినందున భవనంపై మరో రెండు తరగతి గదులు నిర్మాణం చేయాలని సంకల్పించాం. దాతల కోసం ఎదురు చూస్తున్నాం.
–శ్రీనివాసులు, ప్రిన్సిపల్, రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల